జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 75॥ ఆదివారం ॥ 11-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



10 ఆగస్టు 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ద్వాదశి ఉ. 8:01 వరకు తరువాత త్రయోదశి తె. 4:54౦ వరకు సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఆరుద్ర మ. 12:24 వరకు తరువాత పునర్వసు యోగం వజ్ర రా. 10:22 వరకు కరణం తైతుల ఉ. 8:01 వరకు గరజి సా. 6:27 వరకు వర్జ్యం రా. 11:17 నుండి రా. 12:44 వరకు దుర్ముహూర్తం మ. 12:46 నుండి మ. 1:37 వరకు మ. 3:18 నుండి సా. 4:09 వరకు రాహుకాలం ఉ. 7:36 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:46 నుండి మ. 12:21 వరకు గుళికాకాలం మ. 1:56 నుండి మ. 3:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:46 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

జెన్‌జీని తప్పుదోవ పట్టించే

## ప్రయత్నాలు జరిగాయి



### రాజీనామాపై తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

**'నేను రైతు కొడుకును.. వెనక్కి వెళ్లను' అని వ్యాఖ్య**

భువనేశ్వర్, ఆగస్టు 9: నీట్-- యూజీ పరీక్షలో పేపర్ లీక్, ఇతర అవకతవకలపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా తన నిర్ణయంపై స్పందించారు. జెన్‌జీ విద్యార్థు లను కొందరు తప్పుదోవ పట్టించే ప్రయ త్నం చేశారని, వారి తరువాయి 2 వ పేజీలో..



## ఆదివాసీల అభివృద్ధే...
# ప్రభుత్వ లక్ష్యం

### ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు

**గిరిజనులతో మమేకమైన ముఖ్యమంత్రి**

**మౌలిక వసతులు, విద్యకు ప్రాధాన్యం**

**హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు హామీ**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాన్ని గౌరవించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రజలతో మమేకమై వారి సమస్యలు, అవసరాలపై చర్చించారు.

విజయవాడ, ఆగస్టు 9:ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజన సమాజం దేశ సాంస్కృతిక వారసత్వంలో కీలక భాగమని అన్నారు. ప్రకృతిని కాపాడుకుంటూ జీవించే ఆదివాసీల జీవన విధానం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి రంగాల్లో అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఉపాధి అవకాశాల విస్తరణతో పాటు యువతకు తరువాయి 2 వ పేజీలో..



లాల్‌దర్వాజా సింహవాహిని

# అమ్మవారికి పట్టువస్త్రాలు

**బోనాల సందర్భంగా ప్రభుత్వ తరపున సమర్పించిన మంత్రులు**

**అమ్మవారిని దర్శించుకున్న పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు**

హైదరాబాద్, ఆగస్టు 9: ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రి కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు తరువాయి 2 వ పేజీలో..



# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

**నల్లబెల్లిలో పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్**

**భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్న బీఆర్ఎస్ అధినేత**

**పిల్లల భవిష్యత్తుకు పార్టీ అండగా ఉంటుందని హామీ**

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నల్లబెల్లిలో పరామర్శించారు. పెద్ది స్వగృహానికి చేరుకున్న కేసీఆర్ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

వరంగల్, ఆగస్టు 9: పరామర్శ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమ యంలో కంటతడి పెట్టుకున్నారు. పెద్ది మరణం పార్టీకి, తెలంగాణ ఉ ద్యమానికి తీరని - 2 వ పేజీలో..




# విద్యార్థుల ఆందోళనకు దిగొచ్చిన ఝార్ఖండ్ సర్కార్!

**రాంచీ (జార్ఖండ్), ఆగస్టు 9:**

జేపీఎస్సీ జేఎస్ఎస్సీ ఉద్యోగ నియామకాల పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ అభ్యర్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముగ్గురు సభ్యుల రాజీనామాలను గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆమోదించగా, ఆందోళనకారుల డిమాండ్లపై సీఐడీ ఈడీ విచారణలకు ప్రభుత్వం అంగీకరించింది.

**కీలక పరిణామాలు, ప్రభుత్వ నిర్ణయాలు:**

సభ్యుల రాజీనామాల ఆమోదం: జేపీఎస్సీ సభ్యులు అజితా భట్టాచార్య, అనిమా హన్స్ దా, జమాల్ అహ్మద్‌ల రాజీనామాలను రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు గవర్నర్ ఆమోదించారు.

**సీఐడీ, ఈడీ విచారణ:**

14వ జేపీఎస్సీ, బ్యాలెన్స్ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాల నేరపూరిత కోణాన్ని 'సీఐడీ' విచారిస్తుంది. అక్రమ ఆర్థిక లావాదేవీలు ఉన్నందున 'ఈడీ' విచారణకు కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు.

**ఫాస్ట్ ట్రాక్ కోర్టు.. 90 రోజుల్లో ఛార్జ్‌షీట్:**

విచారణ అనంతరం దోషులపై 90 రోజుల్లోగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు.




# మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం.. 45 లక్షలకు టోకరా!

హైదరాబాద్, ఆగస్టు 9 : మ్యాట్రిమోని వెబ్ సైట్ లో నమోదు చేసుకున్న ప్రొఫైల్ ఓ ప్రైవేటు ఉద్యోగి 45 లక్షలు పోగొట్టుకునేలా చేసింది. పెండ్లీ చేసుకొందామని పరిచయమైన యువతి డ్రాప్ షిప్పింగ్ పెట్టుబడులలో లాభాలంటూ నిండా ముంచింది. ఈ సంఘటన పై నమోదైన ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం హైదరాబాద్ హాయత్ నగర్ ప్రాంతానికి చెందిన (39) ప్రైవేటు ఉద్యోగి పేరొందిన మ్యాట్రిమోని వెబ్ సైట్ వివాహం చేసుకునేందుకు తన ప్రొఫైల్ ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రొఫైల్ ను చూసిన (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

**వృషభం:** వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగులు శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

**మిధునం:** ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. తొందరపడి ఇతరులతో మాట్లాడటం మంచిది కాదు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు తప్పవు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురవుతారు. సంతాన అనారోగ్య సమస్యలుంటాయి.

**కర్కాటకం:** కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సమాజంలో ప్రముఖుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. వృత్తి , వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

**సింహం:** నూతన వాహన యోగం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**కన్య:** పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మిక మార్పులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో భాగస్థులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని బారం తప్పదు.

**తుల:** ఆదాయ వ్యవహారాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇంటా బయట విషయాలలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యులు సలహాలు కలసివస్తాయి. సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి ధనం చేతిలో నిల్వ ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్పదు.

**ధనస్సు:** నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వృత్తి ఉద్యోగాలలో కష్టానికి తగిన ఫలితం పొందుతారు. నూతన గృహం కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. ధన పరంగా మరింత పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**మకరం:** ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగాలలో మీ నిర్ణయాలకు తగిన ప్రశంసలు అందుకుంటారు. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

**కుంభం:** మీ ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

**మీనం:** ఇతరులకు మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. పనులలో శ్రమ పెరుగుతుంది. ధనపరమైన ఇబ్బందులు తప్పవు. ఆరోగ్యం సహకరించక చికాకు పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో మనస్పర్థలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు ఉంటాయి.





# ఆదివాసీల అభివృద్ధే... ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గిరిజన యువత ఆధునిక రంగాల్లో రాణించేలా శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. వారి భూములు, జీవనాధారాలు, సాంస్కృతిక గుర్తింపును కాపాడుతూ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన ప్రజల జీవితాల్లో సమగ్ర మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ప్రకటించారు. అభివృద్ధి, సంక్షేమం, సాధికారత అనే మూడు లక్ష్యాలతో గిరిజన ప్రాంతాల పురోగతికి నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.





# లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి పట్టువస్త్రాలు

మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. తెలంగాణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రజలందరికీ మంత్రులు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# జెన్‌జీని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయి

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జూలై 25న ప్రధాని నరేంద్ర మోదీకి తన రాజీనామాను సమర్పించిన ధర్మేంద్ర ప్రధాన్, రెండు వారాల అనంతరం భువనేశ్వర్‌లోని జీఎం విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. 'జెన్‌జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు' అని ప్రధాన్ పేర్కొన్నారు. పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తు, వారి చదువులు, కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీని కలిసి తన రాజీనామాను ప్రతిపాదించినట్లు వివరించారు. దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది పిల్లలు జన్మిస్తున్నారని, యువత ఆకాంక్షలే భారత భవిష్యత్తును నిర్మిస్తాయని అన్నారు.

ఒడిశా పర్యటన సందర్భంగా తనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలపై కూడా ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. విమానాశ్రయంలో బీజేడీ యువజన, విద్యార్థి విభాగాల కార్యకర్తలు 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, ఎవరు వెనక్కి వెళ్లాలని చెప్పినా ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. ఒడిశా ప్రతిష్ఠకు భంగం కలిగించే పని తాను ఎప్పుడూ చేయలేదని స్పష్టం చేశారు. తనపై బీజేడీ నేతలు చేస్తున్న విమర్శలను ప్రధాన్ తీవ్రంగా తప్పుబట్టారు. పర్యటనకు రావాలా వద్దా అనే విషయంపై బీజేడీ ఎమ్మెల్యే ప్రసన్న ఆచార్యను సంప్రదించానని, రావాలని ఆయన సూచించడంతోనే కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు. ఈ వ్యాఖ్యలు చేసిన కార్యక్రమంలో ప్రసన్న ఆచార్య కూడా పాల్గొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి స్పందించారు. ప్రధాన్‌ను ఎవరూ అప్రతిష్ఠపాలు చేయలేదని, విద్యార్థుల ఆందోళనల సమయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపైనే తమ విమర్శలు ఉన్నాయని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి, కన్నీటి వాయువు ప్రయోగించారని ఆరోపిస్తూ, అందుకు నవీన్ పట్నాయక్‌ను బాధ్యుడిని చేయడం సరికాదని ప్రశ్నించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

మొదటి పేజీ తరువాయి

జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టమని, మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశ ప్రజల్లో స్వేచ్ఛా స్ఫూర్తిని మరింత బలపరిచిందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను సందర్శించారు. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అరుదైన చిత్రాలు, చారిత్రక పత్రాలు, ఉద్యమ విశేషాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని నేతలు అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడమే వారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

మొదటి పేజీ తరువాయి

లోటని పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ది కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ. 1 కోటి చొప్పున మొత్తం రూ. 2 కోట్లు కేటాయించగా, ఆయన తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ. 25 లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పెద్ది పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ అనంతరం జిల్లా పార్టీ నాయకులతో సమావేశమై కుటుంబానికి అందించాల్సిన ఇతర సహాయ కార్యక్రమాలపై కూడా నిర్ణయాలు తీసుకుంటామని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నాయి. కేసీఆర్ నల్లబెల్లి పర్యటన సందర్భంగా దారిపొడవునా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికాయి. పలుచోట్ల కాన్వాయ్‌ను ఆపి కార్యకర్తలను పలకరించిన కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో నల్లబెల్లి ప్రాంతం మార్మోగింది.

# మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం.. రూ.45 లక్షలకు టోకరా!

(మొదటి పేజీ తరువాయి)

ముంబయికి చెందిన మహిళ ప్రీతి గుప్తా(28) పేరుతో ఫోన్ చేసి పరిచయం చేసుకుంది. ఆ తర్వాత వాట్సాప్ కు చెందిన రెండు, టెలిగ్రాంకు చెందిన మరో ఫోన్ నెంబర్లను ఇచ్చి వాటిలో తరచు మాట్లాడింది. ఇలా మూడు నెలల పాటు ప్రైవేటు ఉద్యోగి ఆమెతో వాట్సాప్ కాల్స్, విడియో కాల్స్ , చాటింగ్ లు కొనసాగించాడు. ఆ తర్వాత ఆమెను పూర్తిగా నమ్మాడు. ఆ సమయంలో మహిళ మన భవిష్యత్తు కోసం తాను పని చేస్తున్న డ్రాప్ షిప్పింగ్, ఇన్వెస్ట్ మెంట్ కంపెనికి సంబంధించిన వాటిలో భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. ముందుగా 7500 పెట్టుబడితో ప్రారంభించి దాదాపు 45 లక్షల రూపాయాల వరకు పెట్టుబడి పెట్టించింది. వీటికి సంబంధించి ప్రైవేటు ఉద్యోగికి డ్రాప్ షిప్పింగ్ యాప్ లో కేటాయించిన ఐడీ పేజీలో లాభాలు కనిపిస్తున్నప్పటికి వాటిని విత్ డ్రా చేసుకొందామని ప్రయత్నిస్తే మీరు 30 శాతం టాక్స్ చెల్లించాలని యువతి కోరిం ది. ఇలా చివరకు అనేక విధాలుగా ప్రైవేటు ఉద్యోగిని కలవరపెట్టి చివరకు తన ఫోన్ లన్నింటిని స్విచ్ ఆఫ్ చేసింది. మరో ఫోన్ తో ప్రైవేటు ఉద్యోగి సంప్రదించేందుకు ప్రయత్నిస్తే ఆ నెంబరును యువతి బ్లాక్ చేసింది. దీంతో తాను మోసపోయానని భావించిన ప్రైవేటు ఉద్యోగి మల్కాజిగిరి సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో ఇటీవల ఫిర్యాదు చేశారు.

శ్వేత

సంపాదకీయం

ఆదివారం 10-8-2026

# బొద్దింకల వేటలో రాహుల్!

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్దతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి.

టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్ధం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు.

అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ ఘూవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్మందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# ప్రియాంక మృతిపై సీఎం ఆవేదన

**నిందితులను వదిలిపెట్టేది లేదు..**

**కఠిన చర్యలకు ఆదేశాలు**

**కుటుంబానికి ప్రభుత్వం అండ**

**బాధ్యతాయుతంగా ఉండాలని యువతకు సూచన**



అమరావతి, ఆగస్టు 9 : రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొంటూ, ఎంతో భవిష్యత్తు ఉన్న యువ వైద్యురాలు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. ప్రియాంక మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా, మద్యం మత్తులో వాహనం నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు.

ఈ ఘటనపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చంద్రబాబు వెల్లడించారు. నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా గరిష్ఠ శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన యువకులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా, వేగవంతంగా సాగాలని సూచిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తుందని చెప్పారు.

ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన చంద్రబాబు, ఈ కష్టకాలంలో ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువతకు ముఖ్యమంత్రి కీలక సందేశం ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంతో డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయని హెచ్చరించారు. క్షణికావేశం లేదా నిర్లక్ష్యం వల్ల ఇతరుల జీవితాలు నాశనం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.



# ముద్రగడ పద్మనాభం సంతాప సభ

**విశాఖలో ఘనంగా నివాళులర్పించిన బొత్స సత్యనారాయణ**

**పలువురు మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధుల హాజరు**

విశాఖపట్నం, ఆగస్టు 9 : కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ విశాఖపట్నంలో విశాఖ కాపునాడు ఆధ్వర్యంలో నిర్వహించా రు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ హాజరై ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అను బంధాన్ని, ప్రజా జీవితంలో చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముద్రగడ పద్మనాభం తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధా న్ని బొత్స సత్యనారాయణ స్మరించు కున్నారు. ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు, కాపు సామాజిక వర్గం కోసం చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం ప్రజా జీవితంలో ప్రత్యేక ముద్ర వేశారని పలువురు నేతలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఉద్యమ ప్రస్థానం, సామాజిక వర్గం కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభలో మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కరణం ధర్మశ్రీ, మజ్జి శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి తదితర నాయకులు, ప్రజాప్రతినిధు లు కూడా హాజరై ముద్రగడకు నివాళులర్పించారు. కార్యక్రమానికి అభిమానులు, కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ముద్రగడ పద్మనాభం సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

# గిరిజనుల అభివృద్ధితోనే సమగ్ర ప్రగతి

**ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అనిత శుభాకాంక్షలు**

అమరావతి, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గిరిజన సమాజానికి మంత్రి వంగలపూడి అనిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో మమేకమై తరతరాలుగా తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విలువలను కాపాడుకుంటున్న గిరిజన సమాజం రాష్ట్రానికి అమూల్యమైన సాంస్కృతిక సంపద అని పేర్కొన్నారు. గిరిజన సమాజం ఆచారాలు, సంప్రదాయాలు, కళలు, జీవన విధానం దేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని అనిత అన్నారు. ప్రకృతిని పరిరక్షిస్తూ జీవిస్తున్న గిరిజనుల జీవన విధానం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అనిత తెలిపారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ అందించాలని పేర్కొన్నారు.



# మెడికో ప్రియాంక మృతి

**ఐదు రోజుల పోరాటం ఫలించలేదు**

**నిందితులపై హత్య కేసు**

**నమోదు చేయాలన్న కుటుంబం**

**స్వగ్రామంలో విషాద ఛాయలు**

హైదరాబాద్, ఆగస్టు 9 : రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ మృతి చెందింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. వైద్యురాలిగా మంచి భవిష్యత్తు ఉన్న యువతి అకాల మరణంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆగస్టు 3న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్కూటర్‌పై వెళ్తున్న ప్రియాంకను మద్యం మత్తులో కారు నడుపుతున్న ఇద్దరు యువకులు ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో తొలుత రాజమండ్రిలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్య బృందం ఆమెను కాపాడేందుకు నిరంతరం చికిత్స అందించినప్పటికీ పరిస్థితి మెరుగుపడలేదు. చివరకు శుక్రవారం మధ్యాహ్నం 3.25 గంటలకు ఆమె మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి నిందితులు సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌లను అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ప్రస్తుతం ఇద్దరూ జైలులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రియాంక తండ్రి ఈ ఘటనను సాధారణ రోడ్డు ప్రమాదంగా కాకుండా హత్యగా పరిగణించాలని డిమాండ్ చేశారు. తన కుమార్తెను ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టారని ఆరోపించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు కూడా వాహనం కావాలనే ఢీకొట్టినట్లు గుర్తించిన నేపథ్యంలో కేసును మరింత కఠిన సెక్షన్ల కింద దర్యాప్తు చేస్తున్నారు. గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన ప్రియాంక ఎంబీబీఎస్ పూర్తి చేసి రాజమండ్రిలో పీజీ విద్యను అభ్యసిస్తోంది. ఆమె మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, బంధువులు, వైద్య విద్యార్థులు ఆమెకు నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.







# కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

**57.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం**

**మధువాడ ప్రజల బ్రహ్మరథం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, ఆగస్టు 9: కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పేర్కొన్నారు. ఆదివారం గజపతినగరం నియోజకవర్గం గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామంలో 57 లక్షల 30 వేల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన రోడ్లు డ్రైనేజీలు నిర్మాణంతో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళులా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పనిచేస్తున్నారన్నారు. మధుపాడ గ్రామ ప్రజలు పలికిన స్వాగతం, ఆదరణ, ఆత్మీయత బ్రహ్మరథంలా ఉందన్నారు.

నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం పనిచేసే వారిలో లేంక బంగారు నాయుడు ముందు వరుసలో ఉంటారన్నారు.

గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టకుండానే లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేయటం జరిగిందని, జగన్ రెడ్డి చేసిన తప్పులకు ఆంధ్ర రాష్ట్రం 30 సంవత్సరాల వెనకబడిపోయిందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, యువ మంత్రి నారా లోకేష్ గారి సారధ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గజపతినగరంలో వంద పడకల ఆసుపత్రిని తీసుకురావడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వైద్య సిబ్బంది సైతం ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.. యువ మంత్రి లోకేష్ గారు యువగళంలో ఇచ్చిన మాట మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం దేశ విదేశాలలో అనేక సంస్థలతో, పారిశ్రామికవేత్తలతో మాట్లాడి అనేక పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రస్తుత తరుణంలో ఉన్నతమైన విలువలతో రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన నాయకులు మరాపు సురేష్ మాట్లాడుతూ ఒక చిన్న గ్రామంలో ఇంత విశాలమైన రోడ్డు వేయటం నాయకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. విబిజి రాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉందని ఆ దిశగా ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలి అన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటం ద్వారా ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రెడ్ శ్రీనుకి 1 లక్ష 5వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెప్పిన అందజేశారు. కార్యక్రమానికి ముందు ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





# యువకులు చైతన్యవంతంగా పనిచేయాలి

## రాజకీయాల్లో యువకులదే కీలకపాత్ర .. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

గజపతినగరం, ఆగస్టు 8: రాజకీయాల్లో యువకులు చైతన్యవంతంగా పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం గజపతినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువకుల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ రానున్న రోజులలో రాజకీయాలలో యువకులదే కీలకపాత్ర అని ఆ దిశగా యువకులు అడుగులు వేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తని గుర్తించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ లోని తెలుగు యువత, ఐటిడిపి లో పనిచేసేవారు ఇంకా చాకచక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి పార్టీ సోషల్ మీడియాలో ఉన్నది లేనట్టు అబద్దాలను నిజం చేస్తున్నారన్న విషయాలను ప్రజలకు తేటతెల్లం చేయాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ యువ నాయకత్వానికి ఉందన్నారు. డీఎస్సీ, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ వ్యతిరేక, నిరసన కార్యక్రమాలు చేపడుతున్న వైకాపా నాయకుల తీరును తిప్పి కొట్టాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా మరింత ప్రాచుర్యం తీసుకురావాలని యువకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నాయకులు పార్టీ బాధ్యతలు చేపడతారని, యువకులు ప్రచార కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వ పనితీరును తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, రాపాక అచ్చం నాయుడు, చప్పా చంద్రశేఖర్, బుజ్జి, ప్రదీప్, భారీ స్థాయిలో తెలుగు యువత, ఐటీడీపీ కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పార్టీ నియమాలను పాటించాలి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

గజపతినగరం, ఆగస్టు 9: తెలుగుదేశం పార్టీలో చేరిన వారు పార్టీ నియమాలను పాటించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు సూచించారు. ఆదివారం సాయంత్రం గజపతినగరం పార్టీ కార్యాలయంలో బొండపల్లి మండలం గరుడబిల్లి గ్రామానికి చెందిన 12 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నచ్చి తెలుగుదేశం పార్టీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని సీనియర్ పార్టీ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. తాజా మాజీ వైస్ సర్పంచ్ మజ్జి అప్పలనాయుడు, వార్డు మెంబర్ పున్నపురెడ్డి స్వామి నాయుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బొద్దల అచ్చం నాయుడు, పున్నపురెడ్డి అప్పలరాజు, మజ్జి గణపతి రావు, పున్నపురెడ్డి భాస్కరరావు లు వారి అనుచరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు నంబూరి రాజేష్ (బుజ్జి), కొండపల్లి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా వేల్పుల కుమారస్వామి



మంథని ఆగస్టు 09: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు) మంథని పేరెంట్స్ కమిటీ నూతన చైర్మన్‌గా వేల్పుల కుమారస్వామి ఎన్నికయ్యారు. పెద్దపల్లి జిల్లా డిసిఓ, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ నవీన్ అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ పదవికి వేల్పుల కుమారస్వామి, శేఖర్ పోటీ పడ్డారు. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 62 మంది తల్లిదండ్రులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రిన్సిపాల్ శ్రీనాథ్ ప్రకటించారు. కుమారస్వామికి 35 ఓట్లు రాగా, పి.శేఖర్‌కు 25 ఓట్లు వచ్చాయి. 2 ఓట్లు చెల్లలేదు. అనంతరం ఇతర కమిటీ పదవులకు ఏకగ్రీవ ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ వేల్పుల మొగిలి, ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కోశాధికారి జంజర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి నల్లి సతీష్, కమిటీ సభ్యులుగా కన్నూరు సదయ్య, వెంకటస్వామి, స్వామి, దండ్రు భూమేష్, గద్దల మహేష్, కాసిపేట సారయ్య, బి.శ్రీనివాస్, ఎన్.సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, ఎస్.సారయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఓటు వేసిన ప్రతి తల్లిదండ్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు నాణ్యమైన చదువు, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతతో పాటు హాస్టల్ అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల సహకారంతో అందరు తల్లిదండ్రులను కలుపుకొని పనిచేస్తానని అన్నారు.



# విద్యాశాఖ ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలి

**మండల విద్యా వనరుల కేంద్రం ప్రారంభం: కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, ఆగస్టు 9,

విద్యాభివృద్ధిలో ప్రభుత్వ లక్ష్యాలను విద్యాశాఖ అధికారులు అధిగమించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆదివారం సాయంత్రం గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో 53 లక్షల రూపాయలతో నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యాకల్పన ధ్యేయంగా యువ మంత్రివర్యులు నారా లోకేష్ గారు కృషి చేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడంతో పాటు మంచి ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత కలిగేలా నూతన ప్రణాళికలతో విద్యావ్యవస్థ లోని అధికార గణం ముందుకు సాగాలని సూచించారు. అన్ని శాఖల ఉద్యోగాల కన్నా ఉపాధ్యాయ ఉద్యోగ వృత్తి అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, బావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అలాగే ఒక ఉపాధ్యాయుడు మాత్రమే అన్ని రంగాల నిపుణులను తయారు చేయగలరని, ప్రభుత్వ లక్ష్యాలను అందుకునే విధంగా కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ ఆలయంలో కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు





**సికింద్రాబాద్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు**

**అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**తెలంగాణ ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 9 :

సికింద్రాబాద్ పద్మారావునగర్ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయంలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పర్వదినం సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయన కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలు, శ్రేయస్సు, సమృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులతో కలిసి కిషన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకుని భక్తులతో పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కట్ట మైసమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రజలందరికీ కిషన్‌రెడ్డి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.





# క్విట్ ఇండియా ఉద్యమ వీరులకు ఘన నివాళి

**భారత్ జోడో భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం**

**మహాత్మా గాంధీ 'చేయండి లేదా చావండి' పిలుపును స్మరించిన సీఎం డీకే శివకుమార్**

**బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుల త్యాగాలకు నివాళి**

**కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతల పాల్గొనడం**

బెంగళూరు, ఆగస్టు 9 :

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని భారత్ జోడో భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కార్యక్రమంలో పాల్గొని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధులకు ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఇచ్చిన 'చేయండి లేదా చావండి' పిలుపుతో దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష మరింత బలపడిందని డీకే శివకుమార్ గుర్తుచేశారు. బ్రిటిష్ సామ్రాజ్య పాలనలో కొనసాగిన అణచివేత, దురాగతాలకు ముగింపు పలకాలని క్విట్ ఇండియా ఉద్యమం ద్వారా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకులపై పోరులో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా దేశం కోసం నిలబడిన వారి ధైర్యసాహసాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక ఘట్టంగా నిలిచిందని డీకే శివకుమార్ అన్నారు. మహాత్మా గాంధీ పిలుపుతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో భాగస్వాములయ్యారని, స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్‌తో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ పదాధికారులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం సాధించడంలో వారి పాత్రను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడంతో పాటు స్వాతంత్ర్య పోరాట చరిత్రను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.





# కరీంనగర్‌లో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం

**వాసర గార్డెన్స్‌లో ప్రారంభమైన సమావేశం**

**పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తలతో నేతల భేటీ**

**పార్టీ బలోపేతంపై చర్చలు**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనసైనికులు, వీర మహిళలు**

కరీంనగర్, ఆగస్టు 9 :

జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం కరీంనగర్‌లోని వాసర గార్డెన్స్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర నాయకుడు డాక్టర్ బండారు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమై క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జనసేనను మరింత బలోపేతం చేసే అంశాలపై నేతలు దృష్టి సారించారు. సమావేశానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి నేమూరి శంకర్‌గౌడ్ హాజరయ్యారు. పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు కూడా పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలివచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయడం వంటి అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కరీంనగర్‌లో జనసేనను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు సంకల్పం వ్యక్తం చేశాయి.



# బ్రెజిల్‌లో ఘోర హెలికాప్టర్ ప్రమాదం

**దట్టమైన అడవిలో కుప్పకూలిన హెలికాప్టర్**


రియో డి జనీరో, ఆగస్టు 9 :

బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఆల్టో డా బోవా విస్టాలోని విస్టా చినేసా ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్‌తో పాటు నలుగురు మృతి చెందినట్లు అగ్నిమాపక సిబ్బంది ధ్రువీకరించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. దట్టమైన అడవిలో కూలిపోయిన హెలికాప్టర్ శిథిలాలను గుర్తించారు. విమానం కుప్పకూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. మృతుల్లో పైలట్‌తో పాటు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కొలంబియా మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సాంకేతిక లోపమా, వాతావరణ పరిస్థితుల ప్రభావమా లేదా ఇతర కారణాలా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై రియో డి జనీరో మేయర్ ఎడ్వర్డో కావలియర్ స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఏడు నెలల తర్వాత హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**కెనడాలో భారతీయ సంతతి యువతి దారుణ హత్య**

టొరంటో, ఆగస్టు 9 :



కెనడాలో భారతీయ సంతతికి చెందిన 30 ఏళ్ల యువతి హిమాన్షు ఖురానా హత్య కేసులో ఏడు నెలల తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది డిసెంబర్ 19న టొరంటోలోని వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్, స్ట్రాచన్ అవెన్యూ ప్రాంతంలో హిమాన్షు హత్యకు గురయ్యారు. మరుసటి రోజు పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మొదట ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా పరిగణించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. అనంతరం ఇది హత్యగా నిర్ధారణైంది. హిమాన్షు మృతికి సంబంధించి ఆమెకు పరిచయస్తులు, సమీప వ్యక్తులు, ఆమె వ్యక్తిగత సంబంధాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ కేసు ఆ సమయంలో టొరంటోలో నమోదైన 40వ హత్యగా పోలీసులు గుర్తించారు.

దర్యాప్తులో హిమాన్షుతో కొంతకాలంగా సంబంధంలో ఉన్న అబ్దుల్ గఫూరి అనే 32 ఏళ్ల వ్యక్తిపై పోలీసులకు అనుమానాలు బలపడ్డాయి. అతడే హిమాన్షును హత్య చేసినట్లు ఆధారాలు లభించడంతో నిందితుడిగా గుర్తించారు. ఇద్దరి మధ్య విభేదాలు హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే హత్యకు అసలు కారణం దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుందని అధికారులు తెలిపారు. హత్య అనంతరం అబ్దుల్ గఫూరి పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు జాతీయ స్థాయిలో అరెస్టు వారెంట్ జారీ చేశారు. అతడి ఫొటోలు, వివరాలను బహిరంగంగా విడుదల చేసి ప్రజలకు సమాచారం అందించారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.



# బోనాల వేడుకల్లో జూపల్లి

**అమ్మవారికి ప్రత్యేక పూజలు.. పట్టువస్త్రాల సమర్పణ**

హైదరాబాద్, ఆగస్టు 9 :

ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్‌లోని రామభక్ష బండ బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని మంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ద్వారా తెలంగాణ ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక వారసత్వం భావితరాలకు చేరుతున్నాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగే బోనాల వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. రామభక్ష బండ బంగారు మైసమ్మ ఆలయం ప్రాంతీయ ప్రజల విశ్వాసానికి కేంద్రబిందువుగా నిలుస్తోందని జూపల్లి అన్నారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ.20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నిధులతో భక్తులకు అవసరమైన సౌకర్యాల విస్తరణ, ఆలయ పరిసరాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల చేపట్టనున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. ఆలయాల పరిరక్షణతో పాటు సంప్రదాయ పండుగల నిర్వహణకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.



# ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 9 :**

అడవులను కాపాడుకుంటూనే అభివృద్ధి దిశగా ఆదివాసీ సమాజం ముందుకు సాగాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల హక్కులు, సంస్కృతి, భాషలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గిరిజన సంక్షేమ రంగానికి రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. విద్య, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, ఆరోగ్యం, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఏ గిరిజన గ్రామం కూడా అభివృద్ధికి దూరంగా ఉండకుండా ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన విద్యార్థులు విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 166 గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత శాతాలు నమోదయ్యాయని, పలువురు విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, నీట్‌లో విజయాలు సాధించారని చెప్పారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ, డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. అడవే గిరిజన జీవనానికి ఆధారం అని పేర్కొన్న మంత్రి, అటవీ సంపదను కాపాడుతూ ఆదాయ వనరులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తేనె, చింతపండు, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులకు విలువ జోడించి మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ద్వారా గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించనున్నట్లు చెప్పారు. గిరిజన భాషలు, జానపద కళలు, సంప్రదాయాలు, చరిత్రను భావితరాలకు అందించడం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న రాంజీగోండ్ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం గిరిజనుల పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు చేరవేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని కార్యాచరణ స్థాయిలో అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి.ఎం., ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన గిరిజన ప్రముఖులను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించగా, గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.






# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

## గాంధీ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆగస్టు 9 :**

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టమని, మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశ ప్రజల్లో స్వేచ్ఛా స్ఫూర్తిని మరింత బలపరిచిందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను సందర్శించారు. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అరుదైన చిత్రాలు, చారిత్రక పత్రాలు, ఉద్యమ విశేషాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని నేతలు అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడమే వారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా బోనాల వేడుకలు

**అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన ఈటల రాజేందర్**

**మూసాపేట, జేఎన్‌టీయూలో ఆలయాల్లో దర్శనం**

**తెలంగాణ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు**

**ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**





**హైదరాబాద్, ఆగస్టు 9 :**

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే ఆషాఢమాస బోనాల వేడుకలు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. పండుగ సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మూసాపేటలోని శ్రీశ్రీ చిత్రారమ్మ తల్లి ఆలయంతో పాటు జేఎన్‌టీయూ వద్ద ఉన్న అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న ఈటల రాజేందర్ తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపును కలిగి ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారి దర్శనాల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఈటల రాజేందర్, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావుతో పాటు స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. భక్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తూ పండుగను ఘనంగా నిర్వహించారు.

# అమరవీరుల కుటుంబాలకు 'టీజీ-వీర్' అండ

**డీజీపీ చేత గ్రీవెన్స్ పోర్టల్ ప్రారంభం**

**వరంగల్‌లో అమరవీరుల కుటుంబాలతో సమావేశం**

**పెండింగ్ సమస్యల పరిష్కారానికి హామీ**


**వరంగల్, ఆగస్టు 9 :**

విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ మరో కీలక అడుగు వేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పర్యటించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, నక్సలిజంపై పోరాటంలో అమరులైన 28 మంది పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమర వీరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'టీజీ-వీర్' గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రారంభించారు. అమరవీరుల కుటుంబాలకు సంబంధించిన సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. ఆర్థిక సహాయం, ఎక్స్‌గ్రేషియా, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాల కేటాయింపు, పెన్షన్, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. కుటుంబ సభ్యులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే సౌలభ్యం ఇందులో ఉంటుందని వివరించారు.

అమరవీరుల ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, ఇప్పటివరకు అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు వంటి సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూనిట్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులు ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించే విధంగా వ్యవస్థను రూపొందించారు. ఈ సందర్భంగా డీజీపీ క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక కుటుంబ కార్డులను అమరవీరుల కుటుంబాలకు అందజేశారు. సమావేశంలో కుటుంబ సభ్యులు తమకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ వివాదాలు, పెన్షన్, ఆర్థిక సహాయం వంటి అంశాలపై తమ ఇబ్బందులను వివరించారు. వాటిని సావధానంగా విన్న డీజీపీ, సంబంధిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తన సేవా జీవిత ప్రారంభ దశలో నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో వరంగల్‌లో విధులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో పోలీస్ సిబ్బంది ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులు, ప్రాణాలకు తెగించి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నేడు రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణానికి పోలీస్ అమరవీరుల త్యాగాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. విధి నిర్వహణకు ప్రాణాల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి దేశం, సమాజం కోసం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను డీజీపీ స్మరించుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.







# నూతన కమిషనరేట్ భవనంపై డీజీపీ సమీక్ష

**ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం**


**ఆధునిక నిఘా వ్యవస్థలకు ప్రాధాన్యం**

**రహదారులు, ప్రాంగణ అభివృద్ధికి సూచనలు**

**వరంగల్, ఆగస్టు 9 :**

నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ భవనాన్ని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదివారం పరిశీలించారు. నేర సమీక్ష సమావేశానికి ముందు కమిషనరేట్ భవన నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న నేపథ్యంలో కొనసాగుతున్న పనుల వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కొత్త కమిషనరేట్ కార్యాలయం ప్రజలకు మరింత చేరువయ్యేలా, సౌకర్యవంతంగా సేవలు అందించేలా రూపకల్పన ఉండాలని సూచించారు. పోలీసు సేవల కోసం వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పనులు పూర్తి చేసుకునే విధంగా భవన నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అంతర్గత పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే విధంగా కార్యాలయ విభాగాలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి అవసరమైన సదుపాయాలతో పాటు మెరుగైన నిఘా వ్యవస్థల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌కు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉపయోగంలో లేని, శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలను తొలగించాలని డీజీపీ సూచించారు. కొత్త కమిషనరేట్ భవనానికి వెళ్లే అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు కార్యాలయం సులభంగా కనిపించేలా, సౌకర్యవంతంగా చేరుకునేలా ప్రాప్యతను మెరుగుపరచాలని డీజీపీ స్పష్టం చేశారు.







# వైభవ్ వయసుపై చర్చ అనవసరం!

ముంబయి ఆగస్టు 9 :

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ పేసర్ బ్రెట్ లీ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ వయసుపై జరుగుతున్న చర్చ అనవసరమని, అతడిలో అపారమైన ప్రతిభ ఉందని పేర్కొన్నాడు. భారత క్రికెట్‌కు లభించిన అద్భుతమైన ఆటగాడిగా వైభవ్‌ను అభివర్ణించిన బ్రెట్ లీ.. భవిష్యత్తులో అతడు ఎన్నో గొప్ప విజయాలు సాధించే అవకాశం ఉందని అన్నాడు. ఇటీవల 'బీర్ బైసెప్స్' అనే యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రెట్ లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ వయసు 15 ఏళ్లేనా? 17 లేదా 18 ఏళ్లా? అనే చర్చ కంటే.. అతడు మైదానంలో ఎలా ఆడుతున్నాడనేదే ముఖ్యమని స్పష్టం చేశాడు.

**వయసు కాదు.. ప్రతిభే ముఖ్యం**

వైభవ్ వయసు ఎంత అన్నది తనకు ముఖ్యం కాదని బ్రెట్ లీ పేర్కొన్నాడు. 15 ఏళ్లైనా, 17 లేదా 18 ఏళ్లైనా అతడిలో ఉన్న క్రికెట్ ప్రతిభను తక్కువగా అంచనా వేయలేమని అన్నాడు.

భారత క్రికెట్‌కు దొరికిన గొప్ప ఆటగాళ్లలో వైభవ్ ఒకడిగా ఎదగగలడని, రాబోయే రోజుల్లో మరెన్నో విజయాలు సాధించే సామర్థ్యం అతడిలో ఉందని ప్రశంసించాడు.

**ఐపీఎల్‌లో భయంలేని బ్యాటింగ్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ తన భయంలేని ఆటతీరుతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. బౌలర్ పేరు, ప్రతిష్ఠతో సంబంధం లేకుండా భారీ షాట్లు ఆడుతూ తనదైన ముద్ర వేశాడు.

అతడి బ్యాట్ వేగం, దూకుడైన బ్యాటింగ్ శైలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐపీఎల్‌లో చూపిన అద్భుత ప్రదర్శనతోనే భారత టీ20 జట్టు నుంచి అతడికి పిలుపు లభించింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. జింబాబ్వే పర్యటనలో అద్భుతంగా పుంజుకుని 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

**ఆస్ట్రేలియా బౌలర్లనూ ఎదుర్కొన్నాడు**

వైభవ్ బ్యాటింగ్‌లోని పరిణతిని బ్రెట్ లీ ప్రత్యేకంగా ప్రశంసించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సాధించిన 97 పరుగుల ఇన్నింగ్స్‌ను గుర్తుచేశాడు. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు వేగంగా బంతులు సంధించినప్పటికీ.. వైభవ్ ఏమాత్రం భయపడకుండా ధైర్యంగా హుక్ షాట్లు ఆడాడని బ్రెట్ లీ కొనియాడాడు. ఇంత చిన్న వయసులోనే అతడు చూపిస్తున్న ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ నైపుణ్యం తనను ఆకట్టుకున్నాయని పేర్కొన్నాడు.

**పేరు, అంచనాలను నిలబెట్టుకోవడమే సవాల్**

అయితే వైభవ్ సూర్యవంశీకి అసలు పరీక్ష ఇక ముందే ఉందని బ్రెట్ లీ అభిప్రాయపడ్డాడు. చిన్న వయసులోనే వచ్చిన భారీ పేరు, గుర్తింపు, అంచనాలను తట్టుకుని నిరంతరం అత్యుత్తమ ప్రదర్శన చేయడం అతడికి అతిపెద్ద సవాల్ అని పేర్కొన్నాడు. వైభవ్ తన ప్రతిభను క్రమంగా మెరుగుపరుచుకుంటూ, ఒత్తిడిని అధిగమిస్తే భారత క్రికెట్‌లో సుదీర్ఘకాలం సేవలు అందించే స్టార్‌గా ఎదగగలడని బ్రెట్ లీ విశ్వాసం వ్యక్తం చేశాడు.

# గిల్‌పై గుడ్‌న్యూస్!

కొలంబో ఆగస్టు 9 :

శ్రీలంక, భారత్ మధ్య రెండు టెస్టుల సిరీస్ మరో ఆరు రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే గాయాల బెడదతో టీమిండియా ఆందోళనలో ఉండగా.. సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఊరటనిచ్చే వార్త వచ్చింది. కుడిచేతి వేలికి గాయం కావడంతో తొలి టెస్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. అయితే తాజాగా గిల్ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దీంతో గిల్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. కొలంబో వేదికగా శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న సన్నాహక మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో గిల్ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని క్రీడా వర్గాలు అంచనా వేస్తున్నాయి. వేలి గాయం కారణంగా తొలి రెండు రోజుల ఆటకు అతడు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మూడో రోజు ఫీల్డింగ్‌కు గిల్ రాకపోయినా.. బ్యాటింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గిల్ గైర్హాజరీలో భారత జట్టుకు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే శ్రీలంక సిరీస్‌కు ఎంపికైన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, బ్యాటర్ సాయి సుదర్శన్ గాయాల కారణంగా దూరమయ్యారు. మరోవైపు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా తొలి టెస్టుకు అందుబాటులో ఉండకపోవచ్చని సమాచారం. ఈ పరిస్థితుల్లో గిల్ తిరిగి జట్టులోకి వస్తే టీమిండియాకు మరింత బలం చేకూరనుంది.





# అస్మితకు కెరీర్‌లో తొలి టూర్ టైటిల్!

కొరియా మాస్టర్స్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ అస్మిత చాలిహా సత్తా చాటింది. కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 35వ ర్యాంకర్ హాన్‌పై 14-21, 21-14, 21-14 తేడాతో విజయం సాధించింది.

తొలి గేమ్‌లో 14-21తో ఓడిపోయిన అస్మిత.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. వరుసగా రెండు గేమ్‌లను 21-14తో గెలుచుకుని టైటిల్‌ను సొంతం చేసుకుంది. గంటలోపే మ్యాచ్‌ను ముగించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది.

**సెమీఫైనల్లో రక్షితపై గెలుపు**

ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లోనూ అస్మితకు గట్టి పోటీ ఎదురైంది. భారత్‌కే చెందిన రక్షిత రామ్‌రాజ్‌ను 21-13, 16-21, 21-13తో ఓడించి తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సింగిల్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ విజయంతో సూపర్ 300 లేదా అంతకంటే ఉన్నత స్థాయి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సింగిల్స్ టైటిల్‌ను గెలిచిన ఐదో భారతీయ మహిళా షట్లర్‌గా అస్మిత నిలిచింది.

**ప్రపంచ 50వ ర్యాంకులో అస్మిత**

అస్సాంకు చెందిన 26 ఏళ్ల అస్మిత ప్రస్తుతం ప్రపంచ 50వ ర్యాంకులో ఉంది. గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పార్క్ టే-సాంగ్ ఆధ్వర్యంలో ఆమె శిక్షణ పొందుతోంది. కొరియా మాస్టర్స్ 300లో వరుసగా అద్భుత ప్రదర్శనలు చేసి తొలి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్ సాధించడంతో అస్మిత కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా నిలిచింది.



# ప్రపంచకప్‌లో రోహిత్ ఉండాల్సిందే!

ముంబయి ఆగస్టు 9 :

వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో భారత జట్టు కూర్పుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తుపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. రోహిత్ ఫామ్ కంటే వయసు, ఫిట్‌నెస్‌పైనే ఎక్కువగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో మాజీ కెప్టెన్ అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశాడు.

రోహిత్ శర్మ 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా లేదా అనే విషయంపై టీమిండియా మేనేజ్‌మెంట్ స్పష్టమైన ప్రకటన చేయాలని రహానే సూచించాడు. ప్రతి వన్డే సిరీస్‌కు ముందు రోహిత్ భవిష్యత్తుపై చర్చ జరగడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో రోహిత్ శర్మలాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడి సేవలు జట్టుకు ఎంతో ఉపయోగపడతాయని రహానే పేర్కొన్నాడు. ఇన్నేళ్లుగా భారత జట్టుకు రోహిత్ అందించిన సేవలు అద్భుతమని కొనియాడాడు. ఆటగాడికి ఫామ్‌తో పాటు మానసిక ప్రశాంతత కూడా ఎంతో ముఖ్యమని రహానే తెలిపాడు. ఒకసారి రోహిత్ ప్రపంచకప్‌లో ఆడతాడని మేనేజ్‌మెంట్ స్పష్టత ఇస్తే, అతడిపై అనవసర చర్చలకు తెరపడుతుందని పేర్కొన్నాడు. రోహిత్ శర్మ స్థాయి, సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, అతడు 2027 ప్రపంచకప్ ఆడాలని భావిస్తే కచ్చితంగా బరిలోకి దిగాలని రహానే స్పష్టం చేశాడు.

# సచినే గ్రేటెస్ట్ క్రికెటర్!

క్రికెట్ ప్రపంచంలో తరచూ జరిగే 'ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ప్లేయర్' ఎవరు? అనే చర్చకు ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్ బ్రెట్ లీ తనదైన సమాధానం ఇచ్చాడు. దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్‌తో పోల్చితే తన ఓటు మాత్రం భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కేనని స్పష్టం చేశాడు.

మాజీ క్రికెటర్లు స్కాట్ స్టైరిస్, పార్థివ్ పటేల్‌తో కలిసి పాల్గొన్న ఓ పాడ్‌కాస్ట్‌లో బ్రెట్ లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. జాక్వెస్ కలిస్ గణాంకాలు అద్భుతంగా ఉన్నాయని అంగీకరించిన లీ.. టెస్టుల్లో 13 వేలకుపైగా పరుగులు, 292 వికెట్లు, వన్డేల్లో 11 వేలకుపైగా పరుగులు, 270కుపైగా వికెట్లతో అతడు గొప్ప ఆల్‌రౌండర్ అని కొనియాడాడు. అయితే ఇద్దరిలో ఒక్కరినే ఎంచుకోవాల్సి వస్తే తాను కచ్చితంగా సచిన్ టెండూల్కర్‌నే ఎంపిక చేసుకుంటానని తేల్చిచెప్పాడు. ప్రపంచ అత్యుత్తమ బౌలర్లను ఎదుర్కొన్న తీరు అసాధారణం సచిన్ గొప్పతనానికి అతడి గణాంకాలతో పాటు ప్రత్యర్థి బౌలర్లపై చూపిన ప్రభావమే ప్రధాన కారణమని బ్రెట్ లీ పేర్కొన్నాడు. ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన బౌలర్లను, భిన్నమైన పిచ్‌లపై సచిన్ ఎదుర్కొన్న తీరు అసాధారణమని ప్రశంసించాడు. కోట్లాది మంది అభిమానుల అంచనాల ఒత్తిడిని తట్టుకుని ఇన్నేళ్ల పాటు అత్యున్నత స్థాయిలో ఆడటం సాధారణ విషయం కాదని అన్నాడు. తన కెరీర్‌లో సచిన్‌కు బౌలింగ్ చేయడం అత్యంత కష్టమైన సవాళ్లలో ఒకటని గుర్తుచేశాడు.

**'సచిన్‌లో లోపాలు వెతకడం కష్టం'**

సచిన్ బ్యాటింగ్‌లో లోపాలు వెతకడం దాదాపు అసాధ్యమని బ్రెట్ లీ ప్రశంసించాడు. అతడి డిఫెన్స్ అత్యంత పటిష్ఠంగా ఉండేదని, అదే సమయంలో క్రీజులోకి వచ్చిన వెంటనే బౌలర్‌పై ఆధిపత్యం చెలాయించే సామర్థ్యం సచిన్‌కు ఉందని పేర్కొన్నాడు. ప్రత్యర్థిగా సచిన్ మైదానంలో సృష్టించిన ప్రభావం, అతడి చుట్టూ కనిపించే ప్రత్యేకమైన 'ఆరా'ను మరే క్రికెటర్‌లోనూ తాను చూడలేదని బ్రెట్ లీ చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు, 34 వేలకు పైగా పరుగులు సాధించిన సచిన్ టెండూల్కర్.. ప్రపంచ క్రికెట్‌లో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడు.







## వామిక గబ్బి.. హీరోలను డామినేట్ చేసే పెర్ఫార్మెన్స్

విలక్షణ దర్శకుడిగా తన మార్క్ టేకింగ్ తో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రముఖ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ హీరోగా మారి ఇటీవల నటించిన తొలి చిత్రం డీసీ. ఆగస్టు 7వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఇందులో చంద్ర అనే పాత్రలో నటించింది బాలీవుడ్ బ్యూటీ వామిక గబ్బి. అయితే తాజాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాగా సినిమాలో ఈమె నటనను చూసి ప్రేక్షకులు ఈమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈమె క్యారెక్టర్, నటన సినిమాకే హైలెట్ అని , కొన్ని చోట్ల లోకేష్ ను డామినేట్ చేసి నటించింది అంటూ తెగ పొగిడేస్తున్నారు.

## కెరీర్‌పై కామెంట్స్.. కీర్తి సురేష్ బోల్డ్ రిప్లై

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ ఒక ప్రత్యేక డ్యాన్స్ నంబర్ చేస్తోందని, మంచి ఆఫర్లు లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకుందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ వచ్చాయి. అయితే, ఈ వార్తలపై సీరియస్ అవ్వకుండా కీర్తి సురేష్ చాలా చాకచక్యంగా, హ్యూమరస్ స్టైల్‌లో తమిళంలో ఇచ్చిన కౌంటర్ రిప్లై ఇచ్చింది. 'వేరే లెవల్ పొంగ! చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్నది తెలుగు సినిమా, కన్నడ కాదు' అని తమిళంలో కామెంట్ పెట్టింది. ఇక ఆమె ఇచ్చిన ఈ సెటైరికల్ కౌంటర్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయి, నవ్వుల ఎమోజీలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.



## కియారాకు యష్ సపోర్ట్

కియారా కష్టపడే తత్వాన్ని యష్ ఆకాశానికి ఎత్తేశాడు. ప్రసంగం మధ్యలో యష్ కియారా పేరు ఎత్తగానే.. ఆడియన్స్ నుంచి ఒక అభిమాని ఆమె నటించిన పాపులర్ పాటను గుర్తుచేస్తూ తబాహి అని గట్టిగా అరిచాడు. దానికి యష్ నవ్వుతూ నిజంగానే తబాహి! అని స్పందించడంతో ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఆ తర్వాత యష్ మాట్లాడుతూ.. ట్రైలర్‌లో ప్రజలు చూసింది కియారా పాత్ర ఒక చిన్న మెరుపు మాత్రమే. ఈ సినిమా కోసం ఈ నటి చూపించిన అంకితభావం.. పడ్డ కష్టం అసాధారణమైనవి అని కొనియాడారు. సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుండి కియారా పాత్రపై నెటిజన్లు గుప్పిస్తున్న విమర్శల గురించి యష్ నేరుగా ప్రస్తావించారు. ఒక నటిగా నువ్వు కొన్ని అనవసరమైన విమర్శలను ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరం. కానీ ఆ నెగెటివిటీని నువ్వు అసలు పట్టించుకోవద్దు! నీ పనిని నువ్వు నమ్ముకో.. తప్పకుండా ప్రేక్షకులు నిన్ను కొనియాడతారు. మనం కాలం కంటే కాస్త ముందున్నాం.. త్వరలోనే జనాలు దీని విలువ తెలుసుకుంటారు అని పేర్కొన్నాడు.






మహేష్ బాబు బర్త్ డే స్పెషల్..

# వారణాసి సినిమా నుంచి అప్డేట్

మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు.



నేడు.. మహేష్ బాబు అభిమానులకు పండుగరోజు. ప్రతి అభిమాని సంబరాలు జరుపుకునే రోజు.. అదే సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. (ఆగస్టు 9) టాలీవుడ్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. గత వారం రోజుల నుంచే మహేష్ ఫ్యాన్స్ ఆయన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకుంటూ వస్తున్నారు. టాలీవుడ్‌లో ప్రిన్స్‌గా, సూపర్ స్టార్ గా పేరు తెచ్చుకున్నాడు మహేష్ . సినిమా ఇండస్ట్రీలో అంచలంచలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరుతెచ్చుకున్నాడు. సూపర్ స్టార్ కృష్ణ వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన మహేష్ చైల్డ్ ఆర్టిస్ట్ గా సినిమాలు చేశాడు. 1979లో వచ్చిన 'నీడ' సినిమాలో మహేష్ బాబు అతిథి పాత్రలో కనిపించాడు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించాడు. 1999లో విడుదలైన 'రాజకుమారుడు' సినిమాతో హీరోగా సినీ రంగ ప్రవేశం చేశాడు. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న మహేష్ ఆతర్వాత వరుస సినిమాలతో దూసుకుపోయారు. రాజకుమారుడు తర్వాత మహేష్ బాబు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించాడు. ఒక్కడు లాంటి ఇండస్ట్రీ హిట్ అందుకున్నాడు. అతడు, పోకిరి, దూకుడు, బిజినెస్ మాన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, శ్రీమంతుడు, భరత్ అనే నేను ఇలా వరుస హిట్స్ అందుకుంటూ టాలీవుడ్ టాప్ హీరో అయ్యాడు. మహేష్ సినిమాలు రిలీజ్ టైం లోనే కాదు రీ రిలీజ్ ల్లోనూ థియేటర్ల దుమ్ముదులుపుతున్నాయి. సినిమాల్లోనే కాదు రియల్ లైఫ్ లోనూ మహేష్ బాబు సూపర్ స్టారే.. తనదైన శైలి నటనతో నవతరం ప్రేక్షకులను మెప్పిస్తున్న మహేష్ .. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు, గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు శస్త్ర చికిత్సలు చేయిస్తూ ఎంతో మంది గుండెల్లో దేవుడిగా నిలిచారు. మహేష్ బాబు కేవలం నటుడిగానే కాదు నిర్మాతగా, పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా భారీగా సంపాదిస్తున్న మహేష్ బాబు.. తన సంపాదంలో లో 30 శాతం వివిధ సేవలకు ఖర్చు చేస్తారు.మహేష్ బాబు ఏపీ లోని స్వగ్రామమైన బుర్రిపాలెం సహా తెలంగాణ లోని సిద్ధాపురం గ్రామాలను దత్తత తీసుకున్నాడు. ఇక నేడు మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో సెలబ్రెటీలు, ఆయన అభిమానులు, యావత్ ప్రపంచమంతా ఉన్న తెలుగు సినిమా ఆడియన్స్ ఆయనకు విషెస్ తెలుపుతున్నారు.



## అల్లు అర్జున్‌కు డై హార్డ్ ఫ్యాన్‌ను

హీరోయిన్ మమిత బైజు కూడా తాజాగా తన ఫేవరెట్ హీరో గురించి చెప్పి అభిమానులను సర్ప్రైజ్ చేసింది. విశ్వనాథ్ అండ్ సన్స్ ప్రమోషన్స్‌లో భాగంగా.. తాను అల్లు అర్జున్ కు డైహార్డ్ ఫ్యాన్ అని, ఆయన సినిమాలను రిపీట్ మోడ్లో చూస్తూ ఉంటాను అంటూ అల్లు అర్జున్ పై తన ఇష్టాన్ని పంచుకుంది. ముఖ్యంగా బన్నీ స్టైల్ అంటే చాలా ఇష్టమని, ఆయనను ఎప్పుడూ ఫాలో అవుతానని కూడా తెలిపింది.

## ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చా

రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా.. క్రియేటివ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ రూపొందించిన ప్రతిష్ఠాత్మక చిత్రం టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ బెంగళూరులో ఎంతో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో కథానాయిక రుక్మిణి వసంత్ తెర వెనుక రాత్రింబవళ్లు శ్రమించిన ప్రొడక్షన్ యూనిట్, కెమెరామెన్, సాంకేతిక బృందానికి వేదికపై నుంచి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఒక నటిగా తనకు దక్కిన గుర్తింపునకు కారణం ఈ సాంకేతిక నిపుణుల శ్రమేనని గుర్తించిన తీరు తనలోని సంస్కారాన్ని, ప్రొఫెషనలిజాన్ని చాటిచెప్పింది. ఈ వినయపూర్వక వైఖరే నెటిజన్ల నుండి గొప్ప ప్రశంసలు తెచ్చిపెట్టింది. మాతృభాషాభిమానాన్ని చాటుకుంటూ సొంత ఊరిలో జరిగిన ఈ వేడుకలో రుక్మిణి కన్నడలోనే మాట్లాడి స్థానిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. యష్ స్టార్‌డమ్ ని కీర్తించిన రుక్మిణి.. ఒక ఫ్యాన్‌గర్ల్‌గా వచ్చాను.. సినిమాలో భాగం చేసారు.. అంటూ రుక్మిణి ఎమోషనల్ అయ్యారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467